# పిచ్చి లచ్చమ్మ

"మేం అయిదుగురం ఆచార్లుగారి ఇంటి అరుగు మీద కూచున్నాం. నెత్తి మీది తెల్లటోపీ పక్కన పెట్టి మంచినీళ్లు తాగి విశ్రాంతిగా మోకాలి దగ్గిర్నించీ కాళ్లు వదిలేశాను. పాత ఇల్లు ఆచార్లు గారిది. అరుగు గోడ మీదికి చూరుదించారు. ఒకనాటి ఎర్రపెంకులు మట్టి కొట్టుకు పోయాయి. అన్నీ అంతే అక్కడ. అసలు అనంతపురం జిల్లానే మొత్తం గాలి లేపుకు పోయింది. వేల నాలికల్తో గాలిదెయ్యం జిల్లాని నాకి పడేసింది. అరచి అరచి అలిసిపోయిన ఎర్రకుక్కలా ఉంది ఆ సాయంకాలం. మమ్మల్ని చూసి రోడ్డు అవతల నుంచి తలపాగా తీసి మెడచుట్టూ వేసుకుని కర్ర మూడో కాలుగా ఓ పెద్దాయన ఒచ్చేడు. ఎండిన బావుల్లాంటి లోతు కళ్లు.

"ఇంక మేం ఓట్లు ఎయ్యం. అంతే" అన్నాడాయన. నా దగ్గిర సమాధానం లేదు. తల ఊపేను. నా వేపు కాసేపలాగే చూసి వెళ్లిపోయాడతను. ఇంతలో పెద్ద కంచంలో చిన్న ప్లేట్ల నిండా సాతాళించిన శనగలు తీసుకొచ్చింది. ఆచార్లు గారి మనవరాలు. రోడ్డుకి అవతల ఎండిపోయిన చెట్టూ, పక్కనే కోమటి ఆంజనేయులి కొట్టూ. శనగలు తింటూ గమనించలేదు. అప్పుడు చూశాను. చెట్టు కొంద నిలబడి వెలిసి పీలికలైన చీరలో జుట్టు విరబోసుకొని నడుం మీద రెండు చేతులూ పెట్టుకుని మా వేపే తీక్షణంగా చూస్తోంది లచ్చమ్మ. వెళ్లమని చెయ్యి ఊపారు ఆచార్లుగారు. వెళ్లనని తల అడ్డంగా ఊపిందామె. రోడ్డు అవతల నుంచి నన్ను చూస్తున్నా ఆమె ఖాళీ కళ్లల్లో ఆశ్చర్యకరమైన మంత్రశక్తి ఏదో నన్ను కట్టి పడేసింది. మరణించిన తరవాత కూడా కళ్లు తీక్షణంగా ఉండడం నేను ఒకటి రెండుసార్లు చూశాను. బహుశా ఆ కళ్లు మృత్యువుని అంగీకరించలేదేమో ననిపించింది.

నా వేపే తదేకంగా చూస్తోంది లచ్చమ్మ. అప్పుడు మేం ఇద్దరమే ఉన్నాం లోకంలో. ఎండకి కాలి కుమిలిన నీలాకాశం నుంచీ మెరుస్తు పెద్దవాన చినుకు ఆమె తల మీద పడింది. లచ్చమ్మ చటుక్కున తలెత్తి పైకి చూసింది జలజల ముత్యాల్లా వడగళ్ల వాన పడుతోంది ఆమె మీద. ఒక్క అరుపు అరిచి అందర్నీ లోపలికి వెళ్లిపొమ్మని, వర్షంలో తడవొద్దని, వడగళ్లు నెత్తి మీద పడితే చచ్చిపోతారనీ నానా గొడవా చేస్తోంది. లచ్చమ్మ. సర్పంచిగారు నవ్వేరు. లచ్చమ్మపైకి చూసి వర్షంలో తడుస్తూ చిన్న పిల్లలా చుట్టూరా

తిరుగుతూ కేకలు పెడుతోంది. కరువు తీరిపోయింది, చెరువు నిండిపోయింది. బోలెడు నీళ్లే నీళ్లు. ఆచార్లుగారు కోపంగా మరోసారి వెళ్లిపొమ్మని చెయ్యి ఊపేరు. పట్టించుకోలేదు. రోడ్డు మీద నడిచే వాళ్లని నడవనివ్వడం లేదామె.

గాలికి ఊగే వర్షపుజల్లులా ఊగిపోతోంది లచ్చమ్మ. నా చుట్టూ ఒక వర్షవలయాన్ని విసిరింది లచ్చమ్మ. నేల తడిసిన పరిమళం గుప్పుమంది.

'అదంతే సారూ మీరు తీసుకొండి' అన్నారు. ఆచార్యులవారు. పెద్దగా నవ్వుతూ పరిగెత్తుతూ వెళ్లిపోయింది లచ్చమ్మ. వర్షాభావం ఏర్పడింది. చాలాసేపు అక్కడే కూచుండిపోయాం. ఆచార్లుగారు వాలుగట్ల గురించీ, నేలకోత గురించీ ఆయన అనుభవాల్ని పెల్లిగిస్తూ మాట్లాడుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం వర్షాలు పడకేగాదు. ఎన్నో ఏళ్ల నుంచీ మనం చేసుకున్న కరువు అన్నారాయన. ఆయన చిన్నతనంలో సుబ్బారావుగారని రాయలసీమ అభివృద్ధి మండలి కమిషనర్‌గా ఉండేవారట. నిజానికి ఆయన పేరూ ఆయన కృషీ నాకు తెలియనవి కావు. సుబ్బారావుగారు చెప్పిన మాట వింటే పరిస్థితులు ఇంత అన్యాయంగా ఉండేవి కావన్నారు ఆచార్లుగారు. నిజమే నాకు ఒకటే అనిపించింది. ఈ మాట లచ్చమ్మకి ఎవరు చెప్తారు? నప్పుడప్పుడు, ఊళ్లో అరుగులు మీదా టీకొట్టు దగ్గిరా కూచున్న రైతుల చేతుల వేపు చూస్తుంటాను. పొలాల్ని పెళ్ళగించి. పైరుని బుజ్జగించే చేతులు స్తబ్దుగా ఉండడం కంటే విషాదం ఇంకేవుంటుంది?"

'అసలా పిచ్చిది ఎవరండీ?'

"రాత్రి సర్పంచిగారిని అడుగుదావనుకున్నాను. ఏదో మాటల్లో పడి ఆయన పట్టించుకోలేదు. మరో రెండు రోజులకి బయల్దేరతావనగా లచ్చమ్మ చచ్చిపోయిందని ఎవరో కబురు తీసుకొచ్చేరు. సర్పంచిగారితో నేనూ వెళ్లేను. ఆయన పొలంలోనే ఎండిపోయిన బావి పళ్లెంలో చచ్చిపడి ఉంది లచ్చమ్మ. కాసేపు నుంచుని జనాన్ని తోసుకుని బయటపడ్డాను. లచ్చమ్మ చచ్చిపోవడంతో గ్రామంలో కరువు ఇంకా స్పష్టంగా, అసహ్యంగా కనిపిస్తుందనిపించింది. ఆ రాత్రి సర్పంచిగార్ని అడిగేను. చుట్ట వెలిగించి కాసేపాలోచించి చెప్పడం మొదలుపెట్టాడాయన. లచ్చమ్మది ఊరు కాదు. సిద్దప్ప నాయుణ్ణి చేసుకుని ఊళ్లో అడుగు పెట్టింది. పాతపరిచయమైన దారిద్ర్యంలోంచి కొత్త దారిద్ర్యంలోకి వచ్చిందామె. పెళ్లి నాటికి నాయుడికి నలభై ఉంటాయి. రెండెకరాల పొలం. అప్పటికి అయిదారు సంవత్సరాల క్రితం మాట ఇదంతా. ఒకటీ అరా చినుకులు పడ్డం. అప్పుచేసి గింజలు తేవడం, మందులు కొట్టడం, నడుం వాల్చేసరికి పొలం ఎండిపోవడం. ఇద్దరూ ఆరు పశువుల్లా ఒళ్లు గుల్ల చేసుకునేవారు. ఆ రెండు ఎకరాల పొలం, చిన్న ఇల్లూ మొత్తం వడగాలిలో ఆవిరై సాయంకాలపు సుడిగాలిలో ఎగిరిపోయాయి. రెండెకరాలెంత

(నువ్వింట్లో కట్టుకునే చీరలు సగం పరిచినా మిగిలిపోతాయి). గింజలమ్మిన షావుకార్ని నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడని పోలీసులు పట్టుకున్నారు. మధ్యాహ్నం బస్సులో వచ్చి ఎవరో ఊరంతా చెప్పేరు. నాయుడికి ఏడుపు ఆగలేదు. చాలామంది ఊళ్లో నకిలీ విత్తనాలు చావుని కొనుక్కున్నట్టు కొన్నవాళ్లే. చచ్చిన బిడ్డకి పాలిచ్చినట్టయింది. నాలుగైదు రోజుల తరవాత ఆ రోజు రాత్రి పడుకోబోతూ లచ్చమ్మతో అన్నాడు.

'నీయమ్మ. నీకు నాకంటే బికారి నా కొడుకు దొకరలేదంటే మీ ఊళ్లో?'

ఉదయం ఎనిమిది గంటలకి పొలంలో నాయుడి శవాన్ని చూశారు. పక్కనే మామూలుగా పురుగుల మందు డబ్బా. ఖాళీగ్లాసు, పిడికిటి నిండా మట్టి పట్టుకుని ఉన్నాడు. అంతా అయిపోయిం తరువాత కూడా లచ్చమ్మని ఎవరూ తీసుకెళ్లలేదు. ఎవరూ రాలా. మాటా మంతీ లేకండా పొలంలో, కరువులా నిశ్శబ్దంగా ఉండిపోయింది లచ్చమ్మ కొన్నాళ్లు వాళ్లూ వీళ్లూ పలకరించడం, అందరూ కలిసి నాయుడి నెపం మీద ఏడవడం అయిం తరవాత మిగిలిపోయిన జీవితాన్ని నెత్తికెత్తుకుంది.

సిద్దప్ప పోయిన నెలరోజుల తరవాత సరిగ్గా అదే రోజున ఆచార్లుగారి వీధిలో పెద్ద కలకలం బయలుదేరింది. అర్ధరాత్రి. వెన్నెల రోజులు. వీధిలో మంచాలు వేసుకుని పడుకున్న జనం దెయ్యం మీద పడ్డటు అదిరిపడి లేచేరు. అరుపులకి తోడు పిల్లల ఏడుపులు. వీధిలో పరిగెడుతూ నీడలాంటి ఆకారం చేతిలో కర్రతో మంచాల మీద కొడుతూ అందర్నీ నిద్రలేపుతోంది. పూనకం వచ్చిన దానిలా లచ్చమ్మ కేకలు పెడుతోంది. కాలువ పొంగి ఊరి మీద పడుతోంది. ఆకాశం పగిలి తుపాను వర్షం. కొట్టుకుపోతారు. చస్తారు. అందరూ లోపలికి వెళ్లపోండని అరుస్తోంది లచ్చమ్మ. మంచాలు, పిల్లలు కొట్టుకుపోతారు. అన్నా లెగండి లెగండని గొడవ చేస్తూ వీధి వీధంతా పొడి మేఘంలా తేలిపోతోంది లచ్చమ్మ. అందరికీ ఏం జరిగిందో తెలిసేలోగా ఆమె గుడి వీధిలోకి పరిగెట్టింది. కొన్ని నిమిషాల పాటు పెద్ద వర్షపు అలజడి సృష్టించిందామె.

కానీ అంతకు ముందు ఒకసారి లచ్చమ్మని నేను చూశాను. రాబోయే ముందన్న మాట. టోపి, గొడుగులు వేసుకుని మేం కొండవాలు లోంచి చెరువులోకి వెళ్లే కాలవ వెంట నడుస్తున్నాం. కాలవ ఎర్రగా, మాడిపోయిన రక్తనాళంలా ఉంది. చటుక్కున ఎవరో వెనక వస్తున్నట్టు అలికిడి అయి చూశాను. ఎటో చూస్తూ కాలవలో నడుస్తూ వెనకాల వస్తోంది లచ్చమ్మ. మావేపు చూడ్డం లేదామె. రంగుపోయిన పసుపుచీరలో ఎండిపోయిన జుత్తుతో లచ్చమ్మే కాలవలా ఉంది.

తిన్నదో లేదో ఆ రాత్రి గొడవ జరిగిన తరవాత రెండురోజులు లచ్చమ్మ ఇంట్లో పడుంది. అప్పట్నించి రాత్రో పగలో హఠాత్తుగా వర్షాన్ని మోసుకొస్తుంటుందామె. ఆమె

తడిసి ముద్దయిపోతూ అందర్ని తడవకుండా కాపాడుతూంటుంది. ఒణికిపోతూ ఊగిపోతూ శుష్కించిన మాంసంతో మిగిలి ఉన్న జీవంతో ఎండిపోయిన ఆ చేతుల్తో ఆకాశాన్ని ముద్దగా పిండి వర్షం కురిపించే దీక్షలో ఉంటోంది. లచ్చమ్మ. ఊరి వాళ్లకి జ్ఞాపకంగా మిగిలిపోయిన పెద్ద వర్షాలు. నిండిన చెరువులు, తెగిన కట్ట, పిల్లా పెద్దా అందరికీ ఒక వర్ష స్పర్శ కలిగిస్తూండేది. వానల కోసం తపించి ఎండిపోయిన భూములకి కొన్ని వేల నీటి చేతుల చల్లటి ఓదార్పు నివ్వడానికి లచ్చమ్మ మనకి అర్థం కాని ఒక తపస్సులో ఉండేదనుకుంటాను. అందరి కోసం వర్షాన్ని భావించడం, కలగనడం చేస్తూ ఆమె శక్తులుడిగిన గ్రామదేవతలా అనిపిస్తుంది.

రెడ్డిగారు చెప్తూ, ఒకసారి లచ్చమ్మని కొట్టేరట. చాలా బాధాపడ్డాడు రెడ్డిగారు. ఓ రోజు అర్ధరాత్రి ఆరుబయట మంచం మీద పడుకున్నాడాయన. బాగా పొద్దుపోయేవరకూ మేలుకున్నాడేమో త్వరగా మంచి నిద్రలోకి జారుకున్నాడు. హఠాత్తుగా అన్నా అంటూ పెద్ద కేక. ఎవరో మీద పడ్డట్టయింది. ఉలిక్కిపడి లేచేరు రెడ్డిగారు. మంచం పక్కనే నుంచుని మీదికి ఒంగి 'అన్నా లెగన్నా' అంటూ అరుస్తోంది లచ్చమ్మ. దెయ్యంలా కనిపించింది నిద్రకళ్లకి. ఈ గొడవకి రెడ్డి భార్య కూడా లేచింది. చెరువు కట్ట తెగి నీరు ఊరి మీద పడింది. అందరూ కొట్టుకుపోతున్నారు లెగన్నా అని అరుస్తోంది లచ్చమ్మ. పిచ్చికోపం వచ్చింది రెడ్డి గారికి. బూతులు తిడుతూ మంచం కింద ఉన్న కర్ర తీసుకుని నడుం మీద కొట్టాడు. అమ్మో అంటూ అరిచి కట్ట తెగిపోయిందన్నా అని అరుచుకుంటూ పారిపోయింది లచ్చమ్మ.

నేను ఊరు వదిలే ముందు లచ్చమ్మ పోవడం ఆశ్చర్యంగా ఉంటుంది నాకు చెరువు గట్టు మీద, కాలి మసి అవుతున్న పొలాల్లో లచ్చమ్మ ఎప్పటికీ వర్షరుతువులా తిరుగుతూండేది"

❖ ❖ ❖